
క్లుప్తంగా

మార్చి 1న ఆలయ పునః ప్రతిష్ట



పునః ప్రతిష్టకు సిద్ధమైన కాళీమాత ఆలయం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 7, 8 వార్డులకు చెందిన డబ్బూరివీధి కూడలిలో ఉన్న కాళీమాత ఆలయాన్ని మార్చి 1వ తేదీన పునః ప్రతిష్ఠ చేయనున్నట్లు ఆలయం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమాలు అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ అధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇసురు విజయ్‌కుమార్ రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సదాశివుని రాధాకృష్ణన్ ఆదివారం తెలియజేశారు. దీంతో ఈనెల 27 నుంచి మార్చి 1 వరకు చిత్తూరు జిల్లా నగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు వెల్లడించారు. పీడీ సీహెచ్ వాసుదేవరావు విద్యార్థితో కలిసి చిత్తూరు పయనమయ్యాడు. విజయ్‌కుమార్‌ను జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్ నర్తు ప్రసాదరావు యాదవ్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎంపీటీసీ నర్తు శాంతీ ప్రేమ్‌కుమార్‌లు అభినందించారు.

రహదారిపై తిరుగు ఆవులు పట్టివేత



సుదర్శన థియేటర్ జంక్షన్‌లో ఆవును పట్టుకుంటున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న ఆవుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. రహదారిపై ఆవులు సంచరిస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై నిత్యం ఫిర్యాదులు వస్తుండడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి కూన వినోద్‌కుమార్ టెక్కలి వీధుల్లో సంచరిస్తున్న 7 ఆవులను ఆదివారం పట్టుకొని పంచాయతీ కార్యాలయంలో బంధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవుల యజమానులకు అనేకసార్లు హెచ్చరించినా, ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆవులను పట్టుకోవడం జరిగిందన్నారు. అపరాధ రుసుము చెల్లించి ఆవులను తీసుకెళ్లాలని, లేదంటే గోశాలకు తరలిస్తామని పేర్కొన్నారు.

రహదారి సమస్య పరిష్కారం



నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ వింజాంపాడు గ్రామానికి రహదారి సమస్య పరిష్కారమైంది. జాతీయ రహదారి నుంచి గ్రామానికి రూ.68 లక్షల నిధులతో రహదారి నిర్మాణం పూర్తయ్యింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సమావేశానికి హాజరవ్వాలి'

మందస: మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ఈనెల 27న కాశీబుగ్గలోని ప్రగతిభవన్‌లో జరిగే సమావేశానికి పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జరిగే అవగాహన సదస్సు మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందన్నారు.

సర్వసభ్య సమావేశం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరవ్వాలని కోరారు.

● మర్యాదపూర్వక భేటీ



శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లను విజయనగరంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లను కలుసుకున్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు నర్తు నరేంద్రయాదవ్, ఇప్పిలి కృష్ణారావు, నర్తు ప్రేమకుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.
– కవిటి

● ఆత్మీయ సమ్మేళనం



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగింది. దీనిలో భాగంగా అప్పటి ఉపాధ్యాయులను బస్టాండ్ ఆవరణ నుంచి పాఠశాల వరకు మేళతాళాలతో పూర్వ విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం వారికి సభావేదిక వద్ద పాదపూజ చేసి సత్కరించి జ్ఞాపికలందించారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను వారంతా నెమరువేసుకున్నారు.
– కవిటి

అధికారులు తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

- ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్
- సజావుగా సర్వసభ్య సమావేశం

సోంపేట: మండలంలోని హౌసింగ్ అధికారులు తీరు మార్చుకొని, లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన ఎంపీడీవో బి.వెంకటరమణ ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ మండలంలో ఏ సంవత్సరమూ లేనివిధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరిపంట ఎకరానికి 26 బస్తాల సరాసరి దిగుబడి వచ్చిందన్నారు.

24 రైతు భరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. బేసిరామచంద్రాపురం, బారువ, సుంకిడి గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాల్లో కొద్దిగా ధాన్యం ఉన్నాయని అవికూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యానశాఖాధికారి మాధవీలత మాట్లాడుతూ.. రైతులకు జీడి, కొబ్బరి మొక్కలు రాయితీపై అందజేయడం జరుగుతుందని, కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఉపాధి హామీ ఏపీఓ ప్రమీల మాట్లాడుతూ.. గ్రామాల్లో అవసరమైన ఉపాధి హామీ పనులు గుర్తించి వాటిని సకాలంలో పూర్తయ్యేవిధంగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరారు.

హౌసింగ్ ఏఈ శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఉగాది నాటికి 1,300 ఇళ్లు పూర్తి చేయ్యడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో బిల్లులు మంజూరు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజా ప్రతినిధులు వాపోయారు. దీంతో ఎంపీపీ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెలుగు సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంగి గణపతి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, వైస్ ఎంపీపీ గురాల శ్రీను, రేగు బాలమ్మ, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలను కలిపే కేటీరోడ్డు విస్తరణ పనుల్లో తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాస్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులతో నిర్ణయించిన మేరకే విస్తరించాలి తప్ప, వ్యాపారులకు ఇబ్బందులు కలిగినట్లు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి కాశీబుగ్గ ఎల్‌సీ గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన పనులను నాయకులు, అధికారులు ఆదివారం పరిశీలించారు. రైల్వే గేటు నుంచి కాశీబుగ్గ వైపు త్వరితగతిన జరుగుతున్న సిమెంట్ ఫిల్లర్ పనుల వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో మున్సిపల్ ప్రభుత్వ విప్, 11వ వార్డు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, ఆర్‌అండ్‌బీ డివిజనల్ ఇంజినీర్ శాకుమాను రామినాయుడు, జూనియర్ ఇంజినీర్ డిక్కల విక్రమ్, లక్కోజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



దమయంతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు తల్లి గుజ్జు దమయంతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో వీరి కుటుంబాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పీసీఎంఏ అధ్యక్షుడు పైల వెంకటరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, నాయకులు అంబటి ఆనందరావు, బడగల బళ్లయ్యనాయుడు, బళ్ల శ్రీనివాసరావు, బదకల పులిరాజు, బీర అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పొగ మంచుతో పాట్లు



కింతలిమిల్లు సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద దట్టంగా కురుస్తున్న మంచుతో కనిపించని వాహనాలు



బైపాస్ సమీంలో హైవేను కమ్మేసిన పొంగమంచు

ఎచ్చెర్ల క్యాంపస్: గత మూడు రోజులుగా దట్టంగా పొగమంచు పడుతుంది. దీంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. వేకువ జాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా కురుస్తున్న మంచుతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. జాతీయ రహదారిపై లైట్లు ఉన్న చోట్ల మినహా మిగిలిన చోట వాహనాల రాకపోలను గుర్తించటం సాధ్యం కావటం లేదు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం బైపాస్ సమీపంలో వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో దగ్గరకు వచ్చేవరకూ ఇవి కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉందని స్థానికులు అంటున్నారు. అలాగే జాతీయ రహదారిపై ఎడ్లబళ్లపై ఇసుకను తరలిస్తుంటారు. మంచు కారణంగా ఇవి కూడా కనిపించడం లేదని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు.

పచ్చదనం అందరి బాధ్యత



మొక్కను నాటుతున్న దృశ్యం

జి.సిగడాం: స్థానిక బీసీ వసతి గృహంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా సత్యసాయి సేవా సంఘం సాయిసీడ ప్రోగ్రాం ఇన్‌చార్జి బోయిన చంద్రమౌళి మాట్లాడుతూ.. పచ్చదనం అందరి బాధ్యత అన్నారు. వివిధ రాకాలకు చెందిన 120 మొక్కలను నాటారు. వీటిని సక్రమంగా సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి ఎల్.అప్పారావు, వసతి గృహం వార్డెన్ లోలుగు నూకరాజు, పొందూరు, జి.సిగడాం సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు దున్నా రాధాకృష్ణ, నరవ లోకేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న నర్సింహమూర్తి స్నేహితులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన కళాకారుడు రాయల నర్సింహమూర్తి ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు ఆయన స్నేహితులు రూ.1,23,000ల చెక్కు ఆదివారం అందజేసి అండగా నిలిచారు. కుటుంబ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

'తాగునీరు సరఫరా చేయండి'

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో దోకులపాడు గ్రామంలోని దానం కాలనీ ప్రజలు గత నెల రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి ట్యాంక్ పైపులు బాగులేకపోవడంతో నీటి సరఫరా నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపుల మరమ్మతులు చేపట్టి, తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి బత్సల సూర్యనారాయణ కుమారులు విప్లవకుమార్, శంకర్‌రావులు కలిసి సుమారు రూ.15 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను ఆదివారం వితరణగా అందించారు. నాడు సరైన వసతులు లేని పాఠశాలలో చదువుకున్నామని, నేడు పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించడం అభినందనీయమన్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మదన్, గుణవంతు తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన



డ్రైనేజీ నిర్మాణాలు పరిశీలిస్తున్న క్రైస్తవ పెద్దలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి క్రైస్తవ బరియల్ గ్రౌండ్ వద్ద జరుగుతున్న మున్సిపల్ డ్రైనేజీ కమ్ ఫుట్‌పాత్ పనులను క్రైస్తవ పెద్దలు, నాయకులు ఆదివారం పరిశీలించారు. జంట పట్టణాల్లో ఉన్నటువంటి క్రైస్తవ బరియల్ గ్రౌండ్ రక్షణ గోడ తొలగించి వాటి స్థానంలో డ్రైన్ నిర్మిస్తున్న తీరుతెన్నులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు బోసుబాబు, జాన్సన్, అనీల్‌రాజు, ఐసయ్య, కిరణ్, రాజు, ఐసయ్య, ప్రదీప్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'జూ.ఎన్టీఆర్‌ని ఆహ్వానించడం హాస్యాస్పదం'



మాట్లాడుతున్న రమేష్ యాదవ్

ఇచ్ఛాపురం: టీడీపీలోకి జూనియర్ ఎన్టీఆర్‌ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ ఆహ్వానించడం హాస్యాస్పదంగా ఉందని పట్టణ జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు కొర్రాయి రమేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ నందమూరి వంశీయులదే కానీ నారా వంశానిది కాదన్నారు. సీనియర్ ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచి అడ్డదారిలో చంద్రబాబు పార్టీ పగ్గాలు అందుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలనను అందిస్తుండడంతో, టీడీపీ ఉందనే విషయాన్ని ప్రజలు మర్చిపోయారని ఎద్దేవా చేశారు. గతంలోనూ ఇదే తరహాలో జూనియర్ ఎన్టీఆర్‌ని పార్టీ తరుపున ఎన్నికల ప్రచారానికి వాడుకొని, చంద్రబాబు పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధ్యక్షునిగా కోట్ని ఘన విజయం



దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న శ్రీనివాసరావు

కాశీబుగ్గ: కాశీబుగ్గ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ అధ్యక్షునిగా కోట్ని దుర్గాప్రసాద్ అత్యధిక మెజారిటీతో గెలిపొందారు. కన్యకా పరమేశ్వరి మందిరం వద్ద ఆదివారం జరిగిన ఎన్నికల్లో 930 మందికి ఓటుహక్కు ఉండగా, వాటిలో 820 ఓట్లు పోలయ్యాయి. లెక్కింపులో మాజీ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోట్ని దుర్గాప్రసాద్‌కు 593 ఓట్లు పడటంతో పాటు 470 ఓట్లు మెజారిటీ వచ్చింది. సమీప పోటీదారులు సిందిరి మధుసూదనరావుకు 120, బాలాజీ గుప్తాకు 60 ఓట్లు పడ్డాయి. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌కు వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు బెల్లాల శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ శంకర్ పండా, పట్టణ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు బోర చంద్రకళారెడ్డి, భగవతి రెడ్డిలు అభినందనలు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ ఆపన్న హస్తం



ఆర్థిక సాయమందిస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: మండలంలోని గొనపపుట్టుగ గ్రామానికి చెందిన లండ సంతోష్ కుమార్తె చిన్నారి అన్విక గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారికి ప్రస్తుతం విశాఖపట్నం పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. శస్త్రచికిత్సకు రూ.5 లక్షల ఖర్చు అవుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. దీంతో చిన్నారి వైద్యానికి ఎస్‌జీఎఫ్ సభ్యులు సేకరించిన రూ.42,000 మొత్తాన్ని పినాకిల్ ఆస్పత్రి ఆవరణలో బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు. మరింతమంది దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

నడకతో ఆరోగ్యవంతమైన సమాజం



నెలవారీ సంచికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: నడక ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి వాకర్స్‌క్లబ్ సభ్యులు కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కర్రోతు సత్యం పిలుపునిచ్చారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం స్టార్ వాకర్స్ క్లబ్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థల వద్ద రూ.5.10 కోట్ల మూలధనం ఉందని, మహాత్మా గాంధీ ఫెలోషిప్‌ల ఆదాయాన్ని సేకరించే దిశగా సభ్యులు కృషి చేయాలని కోరారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 1350 క్లబ్‌లు ఉండగా.. వాటిలో 4.80 లక్షల మంది సభ్యులు ఉన్నారన్నారు. మారుమూల ప్రాంతాల్లో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు క్రమం తప్పకుండా జరిపిస్తూ, నడుద్దాం, నడిపిద్దాం, నవశకానికి నాంది పలుకుదాం అంటూ ముందుకు సాగుతున్న స్టార్ వాకర్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఎంతో అంకితభావంతో పనిచేసి, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సంపాదించిన శ్రీకాకుళం స్టార్ వాకర్స్ క్లబ్ మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తారని ప్రశంసించారు. శ్రీకాకుళం లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు హరికా ప్రసాద్ మాట్లాడుతూ.. నడకతో పాటు చక్కని నడవడికను నేర్చుకోవడానికి వాకర్స్ సంస్థలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఆరోగ్య సమాజ నిర్మాణానికి స్టార్ వాకర్స్ క్లబ్స్ కంకణం కట్టుకొని పనిచేస్తున్నాయని క్యాబినేట్ కోశాధికారి కె.వి.రమణమూర్తి, చీఫ్ కో–ఆర్డినేటర్ పీజీ గుప్తాలు అన్నారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ నెలవారీ సంచికను ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఎస్.సంజీవరావు, వి.నాగభూషణం, గజల్స్ వాసుదేవ్, చిరంజీవిరావు, అంజనీపుత్ర వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు బాలు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, ఎం.మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఒకరు చేసే రక్తదానం ముగ్గురి ప్రాణాలను కాపాడుతోందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. రక్తదానానికి విద్యార్థులు కూడా ముందుకు రావాలని కోరారు. శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్‌లో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు పర్యవేక్షణలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులే వారి తల్లిదండ్రులు, బంధువులు రక్తదానం చేసే విధంగా అవగాహన కల్పించడం గొప్పవిషయమన్నారు. సుమారు 300 మంది రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. రక్తదానంపై ఇంకా చాలా మందికి అపోహలు ఉన్నాయని, వాటిని విడనాడి రక్తదానం చేసి బ్లడ్‌బ్యాంకులో రక్త నిల్వలు పెంపునకు సహకరించాలన్నారు. రక్తదాతలకు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, గాంధీ స్మారక మందిరం సభ్యులు ఎం.వి.ఎస్.ఎన్.శాస్త్రి, నిక్కు అప్పన్న, స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, విద్యార్థుల తల్లిదండులు పాల్గొన్నారు.

నేడు కూడా రక్తదాన శిబిరం

ఆదివారం జరిగిన శిబిరానికి కొనసాగింపుగా సోమవారం కూడా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది సకాలంలో చేరుకోలేకపోవడంతో లక్ష్యం మేరకు రక్త సేకరణ జరగలేదన్నారు. ఆసక్తి ఉన్నవారు రక్తదానం చేయాలన్నారు.